# నారింజ నీడలో...

కొందరు తీపి పండ్ల చెట్ల గురించి రాస్తున్నారు. మరికొందరు సువాసనలీనే పూల చెట్ల గురించి రాస్తున్నారు. నాకు మాత్రం పుల్లటి రుచినిచ్చే నారింజ చెట్టు జ్ఞాపకాల గురించి రాయాలనిపించింది.

మా నారింజ చెట్టు గుంటూరులో ఉండేది. బ్రాడీపేట అడ్డరోడ్డులోని మా తాతగారి ఇంట్లో ఉండేది. వేసవి సెలవులు వస్తే అన్ని చెట్లకు పాదులు చేసి ఒక చెట్టుకు ఇంకొక చెట్టుకు మధ్య చిన్న కాలువలు తవ్వి పంపు వదిలితే నీళ్ళు అన్ని చెట్లకు వెళుతుంటే చూసి ఎగురుతుండేవాళ్ళం. మా చిన్నప్పుడు అమెరికాలో ఉండే మా బంధువులు వచ్చారు. అమెరికా ఎక్కడ ఉంది అంటే మ్యాప్ చూపించి ఈ సముద్రాలు దాటాలి అన్నారు. ఇంతలో ఒకాయన వచ్చి భూమి తవ్వితే ఆ కింద ఉంటుంది అన్నాడు. దాంతో మా తమ్ముడు, నేను ఒక అట్లకాడ తీసుకుని నారింజ చెట్టు దగ్గర తవ్వడం మొదలుపెట్టాం. ఎంతసేపటికీ మేమిద్దరం కనపడకపోతే వెతుకుతూ చెట్ల దగ్గరికి వచ్చారు. ఎండలో ఏం చేస్తున్నారు, ఎందుకు తవ్వుతున్నారంటే అమెరికా వెళ్ళడానికి అని చెప్పాం. అంతే అందరూ నవ్వడం. ఇప్పుడు మా తమ్ముడు డాక్టర్ సుబ్రహ్మణ్యం కువైట్ యూనివర్సిటీలో ప్రొఫెసర్. ఎన్నో దేశాలు తిరుగుతున్నాడు. అయినా నారింజ చెట్టు దగ్గర తవ్విన ఘటనను మాత్రం మర్చిపోలేదు.

వేసవి సెలవులకి పిల్లలందరం తాతగారింటికి చేరేవాళ్ళం. తినడానికి ఏదన్నా పెడితే ఎక్కువ, తక్కువ అని గొడవ. అప్పుడు ఒక ఆలోచన తట్టింది నాకు. నారింజకాయ కోసి రెండు భాగాలుగా చేసి శుభ్రంగా గింజలు, తొనలు తీసి ఆ డొప్పలను వెనక్కి తిప్పితే తెల్లభాగం పైకి, ఆకుపచ్చ భాగం లోపలికి వచ్చేది. దానిని దారం కట్టి పైన స్కేలు పెట్టి త్రాసు చేసి తూచుకునేవాళ్ళం. బజారులో ఏవిధంగా త్రాసు ఉంటుందో అదే విధంగా చిన్న పెద్ద గులకరాళ్ళను వేసి సరిచూసే వాళ్ళం. అందుకేనేమో నేను కామర్స్ అధ్యాపకురాలిని అయ్యాను.

మా నానమ్మకు విరగకాసిన నారింజ చెట్టు అంటే ఎంతో ప్రాణం. ఎంతో ఓపికగా రసం తీసి జ్యూస్ చేసి నిల్వ ఉండేటట్లుగా సీసాలలో పోసి అందరికీ పంపించేది. నారింజ రసంతో పచ్చడి, పప్పు చేసేది. ఆ రుచి మరచిపోలేను. మా ఇంటికి గుర్తు నారింజ చెట్టు. కొత్తవారు వచ్చినా, అడ్రస్సు చెప్పాలన్నా ''నారింజ చెట్టు ఉంటుందే అదే నాగేశ్వరరావు గారి ఇల్లు'' అనేవారు. నేను ఎం.కాం చదువుతున్నప్పుడు ఆ చెట్టు నీడే నాకు రీడింగ్ రూమ్. అక్కడ కూర్చుని ఏది చది



వినా మర్చిపోవడం అంటూ ఉండదు. నేను పిహెచ్‌డి చేస్తున్నప్పుడు ఏం చేస్తున్నావు అంటే గుంటూరు మిరపకాయలకి ప్రసిద్ధి కదా, దానిమీద చేస్తున్నా అంటే, మన దొడ్లో నారింజ చెట్టు మీదో, కాయ మీదో చెయ్యొచ్చు కదా! నా పేరు కూడా ఆ పుస్తకంలో ఉండేది అంది.

మా అత్తగారిల్లు మా తాతగారింటి నుంచి పది నిముషాల నడక. మాది కృష్ణనగర్. నేను కాలేజీకి వెళ్ళాలంటే మా తాతగారింటి మీద నుంచి వెళ్ళాలి. పిందెలు పడ్డప్పటినుంచీ నా చూపు దానిమీదే. మా తాతగారి నాన్న, అమ్మ ఆబ్దికం వస్తే ఆ చెట్టుకి తాడుకట్టి మడి చీరలు, ధోవతులు ఆరేసేవారు. నారింజ చెట్టు దగ్గరికి ఎవ్వరూ వెళ్ళకండి, అది మడి కట్టుకుంది అనేది. మా తాతగారు చనిపోయాక మా నానమ్మ నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నా ఎక్కడికీ వెళ్ళకుండా ఆ ఇంట్లోనే ఒక పనిమనిషిని పెట్టుకుని ఉంది. నారింజ, మామిడి చెట్లపైన అంతటి మమకారం. రమ్మనమని పిలిచినా 'నేను ఇక్కడే ఉంటాను. నాకు చెట్లు తోడున్నాయి, మీరు ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళినా అవి మటుకు నాకు కాపలాగా ఉన్నాయి' అనేది. ఆవిడ వయస్సు మీద పడుతుండడంతో చెట్లవైపు వెళ్ళే ఓపిక సన్నగిల్లింది. రోడ్డుపైన వెళ్ళే పిల్లలు నారింజ చెట్టు మీద రాళ్ళు వేసి, గోడ దూకి గొడవ చెయ్యడం ప్రారంభించారు. ''నాకు పద్నాలుగు మంది మనుమలు, మనవరాళ్ళు, పదిమంది మునిమనుమలు, మనవరాళ్ళు ఉన్నారు. వాళ్ళకి కావాలిరా'' అని గట్టిగా అరిచేది. ఇదంతా గమనించి ఆవిడకి తెలియకుండా ఆ చెట్టును నరికేశారు. ఆవిడ లేచి వెళ్ళేస్థితిలో లేదు. ఆ సంగతి ఆవిడకి తెలియకపోయినా ఆవిడ అనారోగ్య స్థితి రోజురోజుకూ క్షీణించి నెల తిరక్కుండా చనిపోయింది. ఆవిడ పేరు అన్నపూర్ణమ్మ. నిజంగా సార్థక నామధేయురాలు. ఆవిడ పోయి సంవత్సరం అవుతోంది. మా నానమ్మ జ్ఞాపకాలు స్మరిస్తూ నారింజ చెట్టుకు ఆవిడకు గల అనుబంధాన్ని తలుచుకుంటూ ఆవిడ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

- డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి, గుంటూరు